క్లుప్తంగా

వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి



బీబీపేట: వాహనదారులు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఎస్సై ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టిన ఆయన పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు తప్పనిసరిగా ధరించాలని, ఎక్కువగా ద్విచక్ర వాహనాలే ప్రమాదాలకు కారణం అవుతున్నాయని అన్నారు. ఆటోల్లో ఎక్కువ మంది ప్రయాణం చేయవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. పెండింగ్ చలానాలు ఆన్‌లైన్ ద్వారా కట్టేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

విరాళాల వెల్లువ



రాజంపేట: అయోధ్య రామ మందిరం ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా రాజంపేటలో చేపట్టే కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ ఆముద సౌమ్య రూ.11,111, డాక్టర్ సిద్ధరాములు రూ.10 వేలను శ్రీ రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. సోమవారం పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

మురికి కాలువ నిర్మాణ పనుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని కత్తల్‌వాడి గ్రామంలోని పలు కాలనీల్లో మురికి కాలువ నిర్మాణ పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు అస్పత్‌వార్ వినోద్ పరిశీలించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలు రావడంతో డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. గ్రామ సర్పంచ్ నాగ్‌నాథ్, నాయకులు అస్పత్‌వార్ వినోద్, అరుణ్, అనిల్ ఉన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఫిబ్రవరి 15న నిర్వహించే సేవాలాల్ జయంతి రోజును రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని మండల గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి విఠల్ డిమాండ్ చేశారు. ఆదివారం లింగంపేటలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజనులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. వారి అభీష్టం మేరకు గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

మాచారెడ్డి: మండలంలోని లక్ష్మీరావులపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా మూడో రోజు ఆదివారం వాలంటీర్లు నిరక్షరాస్యులకు సంతకాలు చేయడం నేర్పించారు. అనంతరం అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలుపుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే హన్మాన్ ఆలయంతో పాటు గ్రామ పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రామకృష్ణారెడ్డి, వాలంటీర్లు ఉన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రజలకు ఆదివారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. అపరిచితుల మాటలు నమ్మవద్దని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంక్, ఏటీఎం వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ సాయగౌడ్, సిబ్బంది ఓం కార్ పాల్గొన్నారు.



కాషాయమయంగా మారిన భిక్కనూరులో గాంధీ చౌక్



ఇబ్రహీంపేటలో .. తోరణాలు



బ్రహ్మజీవాడిలో గోడలపై జైశ్రీరామ్ పెయింటింగ్ వేస్తున్న రామ భక్తులు

సర్వం రామమయం

సాక్షి నెట్‌వర్క్: అయోధ్యలో నేడు రామాలయ ప్రాణ ప్రతిష్ఠ జరగనున్నందున జిల్లా వ్యాప్తంగా ఉన్న రామాలయాల్లో ఉత్సవ ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అయోధ్య జరిగే కార్యక్రమాన్ని వీక్షించేందుకు పలు చోట్ల భారీ తెరలను ఏర్పాటు చేశారు. అయోధ్య కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామాలు, పట్టణాలు సర్వం కాషాయ తోరణాలతో నిండిపోయాయి. అన్ని ఆలయాలను శుద్ధి చేసి కాషాయ తోరణాలతో అలంకరించారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జై శ్రీరామ్ పెయింటింగ్‌లో చాలా ఇళ్లు దర్శనమిస్తున్నాయి.



రంగురంగుల విద్యుత్ దీప కాంతుల్లో మద్నూర్‌లోని మార్వాడీ గల్లీ



వీపుపై శ్రీరాముడి చిత్రంతో బాలుడు



గౌరారంలో ముస్తాబైన శ్రీరామాంజనేయ ఆలయం



భిక్కనూరులోని నగరేశ్వరాలయం



సదాశివనగర్: విరలేశ్వర ఆలయాన్ని శుభ్రం చేస్తున్న భక్తులు



రామారెడ్డిలో కాలభైరవుడి మూల విరాట్‌ను శుద్ధి చేస్తూ..



లింగంపేటలోని రామాలయం వద్ద ఏర్పాట్లు

అభివృద్ధిలో అగ్రగామిగా కామారెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు : రాష్ట్రంలో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందని కిసాన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగన్నగారి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ర్యాగట్లపల్లిలో మాట్లాడుతూ.. గతంలో షబ్బీర్‌అలీ హయాంలో కామారెడ్డి ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పదేళ్లుగా నామమాత్రపు పనులు జరిగాయన్నారు. ప్రస్తుతం షబ్బీర్‌అలీని ప్రభుత్వ సలహాదారుడిగా నియమించినందున కామారెడ్డి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సామ రవీందర్ రెడ్డి, నాగి రమేశ్, మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, భూంరెడ్డి, సంతోష్‌రెడ్డి, సంజీవ్‌లు, సంతోష్, తదితరులున్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం



బోర్లంలో రోడ్డుపై నుంచి వెళ్తున్న కేజ్‌వీల్ ట్రాక్టర్

బాన్సువాడ రూరల్: ప్రస్తుతం యాసంగి వరినాట్లు ముమ్మరంగా సాగుతుండటంతో కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను పట్టీలు లేకుండా రోడ్లపై నుంచి పంటపొలాలకు తీసుకెళ్తున్నారు. దీంతో బీటీ, సీసీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. రూ.లక్షలాది నిధులు వెచ్చించి వేసిన కొత్త రోడ్లు పాడైపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. పట్టీలు వేయని కేజ్‌వీల్స్ రోడ్లపై తిప్పితే జరిమాన తప్పదని ఓవైపు అధికారులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడ్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల వారీగా ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా అలాంటి చర్యలేవి తీసుకోవడం లేదు. పట్టీలు లేకుండా కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడుపుతున్న వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటు నమోదు కోసం దరఖాస్తులు స్వీకరించాలి



మెల్లకుంటతండాలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో ప్రభాకర్



బోర్లంలో .. తహసీల్దార్ వరప్రసాద్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఓటరు జాబితాలో నూతనంగా పేరు నమోదు కోసం 18 ఏళ్లు నిండినవారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. ధర్మారెడ్డి, మెల్లకుంటతండాలో పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. నాగిరెడ్డిపేట తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ ప్రసాద్, బీఎల్‌వోలు సత్యనారాయణ, సవాయిసింగ్ తదితరులున్నారు.

రాజంపేట/భిక్కనూరు: రాజంపేట మండల కేంద్రంతో పాటు పొందుర్తి గ్రామంలో, భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లి, జంగంపల్లి, తిప్పాపూర్ పోలింగ్ బూత్ కేంద్రాలను ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్లు అనిల్ కుమార్, శివప్రసాద్ ఉన్నారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని పలు గ్రామ పోలింగ్ బూత్‌లను ఆదివారం తహసీల్దార్ రాజు పరిశీలించారు. కార్యక్రమంలో గిర్దావార్ అంజు, బూత్ లెవెల్ ఆఫీసర్లు ఉన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ

బాన్సువాడ రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం బూత్ లెవెల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన యువతీ, యువకలు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ వరప్రసాద్ పలు గ్రామాల్లో పర్యటించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర(జుక్కల్): రెండు రోజుల పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటరు నమోదు ప్రక్రియతో పాటు మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను ఆన్‌లైన్లల్లో నమోదు చేశారు.



పొందుర్తి పోలింగ్ బూత్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి

తాత్కాలిక భవనాల్లోనే కార్యాలయాలు

- ఏళ్లుగా కొనసాగింపు
- సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్న ప్రజలు



సొసైటీ భవనంలో తహసీల్ కార్యాలయం



రామారెడ్డి జీపీ కార్యాలయంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): పరిపాలన సౌలభ్యం కోసం అప్పటి బీఆర్‌ఎస్ సర్కార్ కామారెడ్డి కొత్త జిల్లాతో పాటు కొత్తగా మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రామారెడ్డి, రాజంపేట, బీబీపేట్ ,పెద్దకొడప్‌గల్, నస్రుల్లాబాద్‌ను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. మరోసారి పాల్వంచ, డోంగ్లీ మండలాలను 2023లో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏర్పాటు చేసే సమయంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలు, అద్దె భవనాల్లో కావల్సిన కార్యాలయాలను సర్దుబాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు మండల కార్యాలయాలు తాత్కాలిక, అద్దె భవనాల్లో నేటికీ కొనసాగుతున్నాయి.

అన్ని కార్యాలయాల పరిస్థితి అంతే..

కొత్తగా ఏర్పడిన మండల కేంద్రాలకు ఇప్పటివరకు ఒక్క కార్యాలయం కూడా ఏ మండలంలోనూ నిర్మించిన దాఖలాలు లేవు. తాత్కాలిక భవనాల్లో తహసీల్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ, ఐకేపీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన చాలా మండలాల్లో సరిపడా భవనాలు లేక ఇరుకు గదులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏడు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు మండల కార్యాలయాలకు కనీసం స్థల సేకరణ కూడా జరగలేదు. దీంతో ఇప్పట్లో మండల కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించే పరిస్థితి లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రావడంతో శాశ్వత భవనాలు నిర్మించేందుకు నిధులు విడుదల చేసి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యవర్గాలు



రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడి నియామకం

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని లక్ష్మీనర్సింహ ఫంక్షన్‌హాల్‌లో రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడిగా పాత బాన్సువాడకు చెందిన మాసాని అశోక్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఉపాధ్యక్షుడిగా ర్యాల నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాశం రాజిరెడ్డి, సహాయ కార్యదర్శిగా లింగాల గంగారెడ్డి, కోశాధికారిగా ఏర్వాల లక్ష్మారెడ్డిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అనంతరం ప్రమాణస్వీకారం చేసిన మాసాని అశోక్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ బాన్సువాడ నియోజకవర్గం ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి శాలువాతో అభినందించారు.

తిప్పాపూర్ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం



భిక్కనూరు: తిప్పాపూర్ గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంట లింగారెడ్డి, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా దాయరి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏనుగు సురేందర్‌రెడ్డి, గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏలేటి గణేశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బాపురెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నూతన అధ్యక్షుడు కుంట లింగారెడ్డి మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

స్వప్నలోక్ కాలనీ అసోసియేషన్..

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులో గల స్వప్నలోక్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొడకల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా మాలవత్ దశరథ్, ఉపాధ్యక్షుడిగా పసులాది రాజు, కోశాధికారిగా వజీర్ మారుతి రావు, కార్యదర్శులుగా, రమేష్, రాములు, సర్దార్ రెడ్డి, సత్యనారాయణ, స్వామి, రామశంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా పవన్ కుమార్ వ్యవహరించారు.

రాజంపేట ముదిరాజ్ కార్యవర్గం



రాజంపేట: రాజంపేట గ్రామ ముదిరాజ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల నరేష్, ఉపాధ్యక్షులుగా పుట్ట గణేష్, పందుల స్వామి, కార్యదర్శిగా మాణిక్య నాగరాజు, కోశాధికారిగా పిట్ల స్వామి, ప్రచార కార్యదర్శిగా బండారి సాయిలు, సలహాదారులుగా తోడెంగల మల్లేశం, గుర్రాల గంగరాజు, పెద్దమ్మల కుమార్, గజ్జెలు భూపతిలు ఎన్నికయ్యారు.

నస్రుల్లాబాద్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అయినాల లింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంఎల్ఏ ఏనుగు రవీందర్ రెడ్డి తెలిపారు. గ్రామ ప్రధాన కార్యదర్శిగా బోధన్ సాయిలు, ఉపాధ్యక్షులుగా విఠల్, రహీం, కార్యదర్శిగా సాయిబాబా, తదితరులు ఎన్నికయ్యారు.

టీజేఎస్ సదస్సుకు నాయకులు



సదస్సులో టీజేఎస్ జిల్లా నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర విభజన హామీల అమలు–కేంద్ర ప్రభుత్వం వివక్ష అనే అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ జన సమితి సదస్సుకు జిల్లా నాయకులు ఆదివారం తరలివెళ్లారు. కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, నాయకులు చాకలి కుమార్, మధు, పూల్‌సింగ్, రాణి, చందు, రాజు, నవీన్, రవి ఉన్నారు.

ఘనంగా కార్యక్రమాలను నిర్వహించాలి



బీబీపేట: నేడు అయోధ్యలో జరిగే రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీబీపేటలో ఘనంగా నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం హనుమాన్ ఆలయంలో వారు పలు విషయాల గురించి చర్చించారు. హనుమాన్ ఆలయంలో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలతో పాటు భజన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్‌లు సుధాకర్, సయ్యద్ మసూద్‌లు ఆదివారం తెలిపారు. 5వ తరగతిలో అడ్మిషన్ల కోసం ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న వారు, ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న వారు ఫిబ్రవరి 6లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

బాన్సువాడ మైనార్టీ గురుకులంలో..

బాన్సువాడ రూరల్: బోర్లం రోడ్డు తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల(ఇంగ్లీష్ మీడియం)లో రానున్న విద్యా సంవత్సరం కోసం ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ధనలక్ష్మి తెలిపారు. 5వ తరగతిలో 80సీట్లకు గానూ 60సీట్లు మైనార్టీలకు, 20సీట్లు నాన్‌మైనారిటీలకు రిజర్వేషన్ ప్రకారం కేటాయిస్తారన్నారు. అలాగే ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీలో 40 చొప్పున సీట్లు ఉన్నాయని వాటిలో 30 సీట్లు మైనార్టీలకు, 10 సీట్లు నాన్‌మైనార్టీలకు కేటాయిస్తామన్నారు. ఫిబ్రవరి 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారికి మాత్రమే అడ్మిషన్‌కు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 7331170814, 83338 60782 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వీటీజీసెట్ దరఖాస్తు గడువు పెంపు

బాన్సువాడ రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పెంచినట్లు బోర్లం క్యాంపు, కొయ్యగుట్టలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్‌లు పద్మాకుమారి, శోభారాణి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 2023–24లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు.

నేడు రామాలయంలో లక్ష పుష్పార్చన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయంలో సోమవారం లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీరామక్షేత్ర ట్రస్టు ఎల్లారెడ్డి కమిటీ ఆదివారం తెలిపింది. పూజా కార్యక్రమాల ముగింపు అనంతరం అన్నదానం, సాయంత్రం దీపారాధన చేయనున్నట్లు వారు తెలిపారు.

గోపాల్‌పేటలో శ్రీరామ విజయోత్సవ ర్యాలీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అయోధ్యలో శ్రీ రామమందిరంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో సోమవారం శ్రీ రాముని విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు.

'సామాన్యులకు వేదజ్ఞానం అందించాలి'



కామారెడ్డి అర్బన్: కులమతాలకు అతీతంగా సామాన్యుడికి వేదజ్ఞానం అందించాలని ఖమ్మం విశ్వజ్యోతిర్లింగ పీఠాధిపతి, అష్టావధాని డాక్టర్ రాముడు నర్సింహాచార్య అన్నారు. విశ్వబ్రాహ్మణ అర్చక పురోహిత పరిషత్ కామారెడ్డి జిల్లా సమావేశం స్థానిక గోపాలస్వామి రోడ్డులోని శ్రీకాళికాదేవి ఆలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాముడు నర్సింహాచార్య మాట్లాడారు. సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కంది రఘునాథచార్య, అధ్యక్షుడిగా శిర్లవంచ కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శిగా కొండా రామచంద్రాచార్య, కోశాధికారిగా అల్వాల శ్రీనివాసాచార్య, ఉపాధ్యక్షుడిగా దేవరకొండ నరేష్‌చార్య, సహాయ కార్యదర్శిగా దొడ్డు రాజచార్య, సలహాదారులుగా హన్మాండ్లచార్య, మద్దికుంట లింగమాచార్యులు ఎన్నికయ్యారు.